## క్లుప్తంగా

### సెల్‌ఫోన్ అప్పగింత



**ఆత్మకూర్:** మండలంలో చోరీకి గురి అయిన సెల్‌ఫోన్‌ను నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఆదివారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని ఆరేపల్లికి చెందిన సాయికుమార్ సెల్‌ఫోను నాలుగు రోజుల క్రితం చోరీకి గురయిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా.. లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

### మెగా వైద్య శిబిరం



**పెబ్బేరు రూరల్:** కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎస్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో లేబరు కార్డు కలిగిన 45 మంది భవన నిర్మాణ కార్మికులు, గ్రామస్తులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ హెల్త్ జిల్లా కోర్డినేటర్ నరేష్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ వేణుగోపాల్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

### మార్పు కోసం మహా ఉద్యమం



**అమరచింత:** దగాపడ్డ తెలంగాణలో విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ 'మార్పు కోసం మహా ఉద్యమం' అనే కార్యక్రమాన్ని ఆగస్టు 1న హైదరబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్, మండల కన్వీనర్ అఖిల్ తెలిపారు. మార్పు కోసం మహా ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మండలంలోని హైస్కూల్ ఆవరణలో విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 1.91లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, ప్రశాంత్, బాలు, భరత్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎర్రమట్టి తరలింపునకు అనుమతి ఇవ్వాలి

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఉన్న వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణం, ఇతర అవసరాల కోసం ఎర్రమట్టి కొట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ కోరారు. సామాన్య ప్రజలు చిన్నపాటి నిర్మాణాలకు మట్టి తెచ్చుకోవాలన్న అనుమతుల పేరుతో స్థానిక అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు మాత్రం మట్టిని ఎక్కడికి తీసుకెళ్లినా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మాత్రం అనుమతుల పేరుతో కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. కలెక్టర్ దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

### ఎస్టీ జాబితాలో చేర్చాలి

**ఆత్మకూర్:** వాల్మీకులు అన్నిరంగాల్లో వెనుకబడ్డారని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వాల్మీకి బోయ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో మండలంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వాల్మీకులకు ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి వేయ్యి కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఎలాంటి కుల వృత్తి లేని తమకు వాల్మీకి బంధు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. మండ్ల విజయ్, కావలి వెంకటన్న, ఎస్టీడీ శ్రీను, కొత్తబోయ శేఖర్, కావలి రఘు, సూరి, కురుమూర్తి, శ్రీనివాసులు, రాము, రాజశేఖర్ ఉన్నారు.

### ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**వీపనగండ్ల:** కొత్తకోట పట్టణంలో కొనసాగుతున్న వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురైన విద్యార్థిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లాలోని బహదూర్‌గూడెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి మహేందర్ శనివారం రాత్రి పాముకాటుకు గురికాగా ఆ విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రాణాపాయ స్థితిలోకి చేరుకున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కనీసం విద్యార్థి తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు.

# సొంత భవనాలు కరువు

- అద్దె, కమ్యూనిటీ భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల కొనసాగింపు
- 21 కేంద్రాలకు మాత్రమే పక్కాభవనాలు
- నేటికీ ఆచరణకు నోచుకోని భవన నిర్మాణాలు



ఖిల్లాఘనపురంలో అద్దెభవనంలో నిర్వహిస్తున్న మూడో అంగన్‌వాడీ కేంద్రం

**ఖిల్లాఘనపురం:** చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పక్కాభవనాలు, టీచర్లు, ఆయాల లేమితో ఇబ్బందిగా మారింది. ఇరుకు గదులు, ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం నిల్వ ఉంచడం ఇబ్బందిగా మారిందని టీచర్లు వాపోతున్నారు. దీంతో పాటు చిన్నారులకు చదువు, పాఠశాలలపై ఆసక్తి కలిగించేందుకు ఆటలు ఆడించడానికి కూడా వీలు లేకుండా ఉందంటున్నారు.

**మండలంలో 46 కేంద్రాలు**

ఖిల్లాఘనపురం మండలంలో 7 మినీ, 39 పెద్ద అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి మొత్తం 46 ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 21 కేంద్రాలకు మాత్రమే పక్కాభవనాలు ఉన్నాయి. ఆరు కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా మరో 19 కేంద్రాలను కమ్యూనిటీ భవనాలు తదితర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాలకు కేవలం రూ.వెయ్యి మాత్రమే చెల్లిస్తుండడంతో వాటికి తగినట్లుగా ఇరుకు గదుల్లో కేంద్రాలను కొనసాగిస్తున్నారు. మండలంలోని మొత్తం కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 1,059 మంది ఉన్నారు. మరో 1,223 మంది 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు ఇంటి వద్దే పౌష్టికాహారం అందిస్తున్నారు. 248 మంది గర్భిణులు, 286 మంది బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజనం అందించడంతో పాటు వారు పాటించవలిసిన జాగ్రత్తల గురించి కేంద్రాల వద్ద సూచనలు ఇస్తారు. కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు వేరే ఇల్లు వెతుక్కోవాల్సిన దుస్థితి ఉంది. ఇలా ఏడాదికో ఇంట్లో కేంద్రాలను నిర్వహించడం వలన టీచర్లు, ఆయాలతో పాటు పిల్లలను కేంద్రాలకు పంపడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

**వేధిస్తున్న టీచర్లు, ఆయాల కొరత**

మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కర్నెతండా సెంటర్‌తో పాటు నడిమితండా, అల్లమాయపల్లి, ఆముదంబండతండా మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేక చిన్నారులు, ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా మండలంలోని కర్నెతండా, మల్కిమియాన్‌పల్లి, తిర్మలాయపల్లి, వెనికి తండా, మానాజీపేట-1, రోడ్డుమీదితండా, ఖిల్లాఘనపురం-1, కమాలోద్దీన్‌పూర్-1 లో ఆయాలు లేక చిన్నారులను కేంద్రాలకు తీసుక రావడానికి టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణ కూడ టీచర్లే శుభ్రం చేసుకుంటున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలో ఉన్న ఆయాలు, అంగన్‌వాడీ టీచర్ల ఖాళీలు, పక్కాభవనాలు లేని కేంద్రాల వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే సిబ్బందిని నియమిస్తాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే భవనాలు నిర్మించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటారు.

– ఈదమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఖిల్లాఘనపురం

### 14ఏళ్లుగా..



మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రాన్ని సుమారు 14ఏళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నాం. ఇంటి యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు వేరే ఇల్లు చూసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యి అద్దె సరిపోవడం లేదు. ప్రభుత్వం పక్కా భవనం కట్టిస్తే పయోగంగా ఉంటుంది.

– కవిత, అంగన్‌వాడీ టీచర్, ఖిల్లాఘనపురం

### ఆయా లేక ఇబ్బంది



అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇంటింటికీ తిరిగి నేనే పిల్లలను సెంటర్‌కు తీసుకొస్తున్నా. కేంద్రాన్ని నేనే శుభ్ర పర్చుకుంటున్నాను. ప్రభుత్వం వెంటనే ఆయా నియమించాలి.

– లలిత, అంగన్‌వాడీ టీచర్, రోడ్డుమీదితండా

## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**కొత్తకోట:** గ్రామ పంచాయతీల్లో కార్మికులుగా పని చేస్తున్న వారందరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ చేపడుతున్న సమ్మె ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మద్దతు ప్రకటించారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను, సహాయ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా విధుల్లో ఉండి చనిపోయిన కార్మికుల స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రమాదంలో మరణించిన కార్మికులకు ఇన్సూరెన్స్ పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేసి వారంతపు సెలవులు, పండుగ సెలవులు, జాతీయ అర్జిత సెలవు దినాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, సహదేవుడు, కరీం, బొజ్జన్న, గోపాల్, పరమేష్, తిరుపతన్న, నాగేష్ తదితరులు ఉన్నారు.

# ఆధ్యాత్మిక చింతన అవసరం



నర్సింగాపురంలో త్రైత సిద్ధాంతం ప్రచారం చేస్తున్న సభ్యులు



నాగరాలలో..

**పెబ్బేరు రూరల్:** ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఉండాలని, రోజు భగవద్గీత చదవడంతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పెబ్బేరు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పెబ్బేరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల గురించి వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల గూర్చి తెలియజేశారు. గ్రామంలోని కొంత మందికి భగవద్గీత, ఆధ్యాత్మిత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రవి, వెంకట్రాంలు, సురేష్, కృష్ణయ్య, బద్రి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మదనాపురం:** మండలంలోని నర్సింగాపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కొత్తకోట మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి మట్లాడుతూ గురువు 'గుణాతీతుడు, రూపవర్జితుడు, గుణంలో మలినం లేనివాడన్నారు. పరమాత్మ కూడా ఆది అంతం లేని వాడు కాబట్టి అలా పోల్చారని దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువుగా భావించాలని సూచించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత భగవద్గీతలో శ్రీకృష్ణుడి నిజ భావాన్ని పొందుపరిచారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడే జగద్గురువు అని నిరూపించారని, ప్రతి మనిషి త్రైత సిద్ధాంత భగవద్గీత చదివి గురుపౌర్ణమి రోజున ఆయనను పరమాత్మనే గురువుగా పూజించాలన్నారు.

# సాధన సంకల్ప రథయాత్రకు ఘనస్వాగతం



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

**పెబ్బేరు:** టీఎస్ సీపీఎస్ఈయూ సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు ఆదివారం పట్టణ కేంద్రంలో ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావాల్సిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి సీపీఎస్ బాధితులకు న్యాయం చేకూర్చేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర పెబ్బేరు పట్టణ మీదుగా వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయానంద్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి, రవికుమార్, చిన్న రాములు, శివశంకర్, విష్ణువర్ధన్ నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, తిమప్ప, దామోదర్, శ్రీనివాసులు, మహిళా పాలిటెక్నిక్ అధ్యాపకులు దశరథంనాయక్ పాల్గొన్నారు.

**వనపర్తికి చేరుకున్న రథయాత్ర**

**వనపర్తి టౌన్:** రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని భగీరథ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించినట్లు సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి తెలిపారు.

### నేడు చౌడేశ్వరి జయంతి

**ఆత్మకూర్:** తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ మాత జయంతి ఉత్సవాలు సోమవారం ఉదయం నిర్వహిస్తున్నామని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. మండలంలోని తిప్పడంపల్లిలో ఉదయం 6గంటల నుంచి మొదలుకొని చౌడేశ్వరీ మాత ఆలయంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. భజన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు పెరుమాళ్ల బాలరాజు, సత్యన్న, ఈశ్వరయ్య, పేరుమాల్ల సత్యన్న కోరారు.

### కాంగ్రెస్ బలోపేతానికి కృషి

**గోపాల్‌పేట:** మండల కేంద్రానికి చెందిన కొంకి వెంకటేష్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించడం కోసం శాయశక్తులా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌పేట అధ్యక్షుడు శివన్న, మాజీ ఎంపీటీసీ బాలయ్య, సుధాకర్‌రావు, వెంకటయ్య, దేవరాజు, బాలకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**అమరచింత:** మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిని అమరచింత మాజీ ఎంపీటీసీ మాంకాళి విష్ణు ఆధ్వర్యంలో నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కమిటీ సభ్యుడిగా, సౌత్ సెంట్రల్ జోన్ ఇన్‌చార్జ్‌గా నియమితులయిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నందిమల్ల చంద్రశేఖర్, విష్ణువర్ధన్ యాదవ్, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్‌కు ఆర్థికసాయం

**వీపనగండ్ల:** మండల కేంద్రానికి చెందిన తెలుగు కొట్టం రవి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అతడి రెండు కిడ్నీలు పూర్తిగా పాడవడంతో వారి కుటుంబం ఇబ్బందుల్లో కూరుకుపోగా తోటి డ్రైవర్లు, పలువురు యజమానులు ఆదివారం బాధితుడికి రూ.50వేల ఆర్థికసాయం అందించారు. కిడ్నీలు పాడై అనారోగ్యానికి గురైన రవికి వైద్య ఖర్చుల కోసం సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, మండలంలో దాతలు ముందుకు వచ్చి రవి కుటుంబానికి చేయూతనివ్వాలని డ్రైవర్లు కోరారు. కార్యక్రమంలో జీపు రవి, అశోక్‌రెడ్డి, భీరస్వామి, శేఖర్, కుమార్, వీరబాబు, బాలకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..



ఆత్మకూర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

**ఆత్మకూర్:** పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో హరహర మహాదేవ శంభోశంకర పాహిమాం అంటూ శివనామ స్మరణతో మార్మోగింది. మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడికి రుద్రాభిషేకం, బిల్వాభిషేకం, జలాభిషేకం తదితర పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు శివానందస్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాముల సంఘం నాయకులు బాలకృష్ణ, బాల్‌రాజు, అంజి, శ్రీధర్, రవిందర్, రాము, భవాని సంఘం నిర్వాహకులు భారతి, నాగలక్ష్మి, సత్యన్న, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, మార్కెట్ కార్యదర్శి శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

**కోటిలింగేశ్వరుడికి..**

**కొత్తకోట రూరల్:** మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రి, ఆరుద్రనక్షత్రం రెండు కలిసి రావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని ఆలయంలోని శివలింగానికి పాలాభిషేకం చేస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు.

# అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ



ఉప్పరిపల్లిలో కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

**ఖిల్లాఘనపురం:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గాయపల్లి, సూరాయపల్లి, ఉప్పరిపల్లి, సోళీపురం, కోతులకుంట తండా, రుక్కన్నపల్లి తండా, రోడ్డుమీదితండా, దొంతికుంట తండా, షాపురం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నూతన కమిటీల్లో బాధ్యతలు చేపట్టిన వారితో పాటుగా ప్రతి గ్రామంలో ప్రతికార్యకర్త, నాయకుడు శక్తివంచన లేకుండా పనిచేసి, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీతో పాటుగా రూ.500కు గ్యాస్ సిలిండర్, అర్హులైన ప్రతఒక్కరికి ఇళ్ల నిర్మాణం కోసం బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయాలను అన్ని గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు దామోదర్‌రెడ్డి, కృష్ణయ్యయాదవ్, డాక్టర్ నరేందర్‌గౌడ్, దేవిజానాయక్, క్యామ బాల్‌రాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పనిచేసిన వారికే పార్టీ టికెట్ ఇవ్వాలి

**పాన్‌గల్:** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు సీఆర్ జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి సీ జగదీశ్వర్‌రావు వర్గీయులు ఆదివారం కొల్లాపూర్ తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, సుధాకర్‌రావు, నర్సింహానాయుడు, మాజీ సర్పంచ్‌లు బాలస్వామి, ఆదిచంద్రయ్య తదితరులు ఉన్నారు.

**వీపనగండ్ల:** కొల్లాపూర్‌లో ఆదివారం టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎన్నో రోజులుగా తోడుగా అందించిన జగదీశ్వర్‌రావుకు నియోజకవర్గంలోని కార్యకర్తలంతా అండగా ఉంటారని విజయభాస్కర్‌రెడ్డి అన్నారు.

# అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించుదాం



వనపర్తిలో సద్దుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి అసెంబ్లీ పరిధిలోని నాయకులతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలోని దామోదర్ తోటలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన సద్దుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి స్థానిక ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి గెలుపొందాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను పటిష్టం చేసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, నాయకులు సీతారాం, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, సుమిత్రమ్మ, వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చిన్నంబావి:** మండలంలోని దగడపల్లిలో నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆదేశానుసారం గడప గడపకు కమలం, గుండె గుండెకు ఎల్లేని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని వార్డుల్లో దళిత వాడల్లో డబుల్ బెడ్‌రూం, దళితబంధు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే ప్రజల వద్దకే పాలన తెచ్చి పేదలందరికీ న్యాయం చేస్తామని వారు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంపత్, గణేష్‌రెడ్డి, నాయకులు వెంకటస్వామి, కిరణ్, భగవాన్, మాధవి, మండల ఇన్‌చార్జ్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** మండలంలోని గోపల్‌దిన్నెలో బీజేపీ నాయకులు గడప గడపకు కమలం, గుండె గుండెకు ఎల్లేని అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ, మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్, కార్యదర్శి నరేష్, కేశవ్, ఎల్లగౌడ్, రాణాప్రతాప్, లోకేష్ పాల్గొన్నారు.

**మక్తల్‌కు వెళ్లిన నాయకులు**



గోపల్‌దిన్నెలో..

**అమరచింత:** మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మక్తల్ మండలంలోని వల్లభాపురంలో నిర్వహించే నియోజక వర్గ స్థాయి బీజేపీ నాయకుల సమావేశానికి అమరచింత నాయకులు ఆదివారం సద్దులతో తరలి వెళ్లారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాయకులను సమాయత్తం చేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహించారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్, నరాల నారాయణ, క్యామ భాస్కర్ పాల్గొన్నారు.

### బయన్నస్వామికి జలాభిషేకం

**పెంట్లవెల్లి:** వానలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఆదివారం బైయన్న స్వామికి భక్తులు జలాభిషేకం చేశారు. మండలంలోని గట్టుపై వెలిసిన బైయన్నస్వామికి గోపులాపూర్ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. స్వామివారి ఎదుట బండపై పాయసం పోసి రైతులు ఆరగించారు. కార్యక్రమంలో వెంకటస్వామిరెడ్డి, భాస్కర్, కురుమయ్య, నరేష్, పాల్గొన్నారు.